# ప్రజాశక్తి

శుక్రవారం 16 డిసెంబర్ 2022

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి

# కాలుష్యంపై ఖర్చుకు లెక్కాపత్రం ఎక్కడ?



## 2021-22లోనే రూ.100.75కోట్లు విడుదల

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

గాలిలో నాణ్యత విశాఖ నగరంలో ఎప్పుడూ ప్రశ్నార్థకంగానే తయారవుతోంది. నిధులకు మాత్రం కొదవు లేదంటూ పాలకుల ప్రకటనలు సరేసరి.. నగరంపై దుమ్ము, ధూళి దాడితో ప్రజల్లో ఊపిరితిత్తుల సమస్యలు వంటివి పెరుగుతున్నాయంటూ సంబంధిత వైద్యులు మొత్తుకుంటున్నా పట్టించుకునే నాథుడు లేడు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ క్లీన్ ఎయిర్ క్వాలిటీ ప్రోగ్రాం కింద విశాఖకు రూ.2021-22 వరకూ రూ.100.75కోట్లు విడుదల చేసినట్లు గురువారం పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి అశ్వినికుమార్ వెల్లడించారు. 2023 ఆర్థిక సంవత్సరం వరకూ విశాఖకు రూ.148 కోట్లు అనుమతులు చేసినట్లు ప్రకటించారు. గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) గత కౌన్సిల్ సమావేశంలో రూ.28కోట్లకుపైగా కాలుష్యంపై ఖర్చుచేసేందుకు ఆమోదం తెలిపింది.

**పడిపోతున్న గాలిలో నాణ్యత....**

నవంబర్, డిసెంబర్‌లో ఎయిర్ క్వాలిటీ అత్యంత వరస్ట్‌గా ఉన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. 274 మార్క్‌కు చేరింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ప్రకారం 200 ఉంటేనే అత్యంత హీనంగా ఉన్నట్టు లెక్క. ఏయూ అధ్యాపకులు చెబుతున్న ప్రకారం చలికాలంలో గాలిలో కాలుష్య ఉద్గారాలు సులువుగా మనుషుల శరీరాల్లోకి చొచ్చుకుని పోతాయని దీనివల్ల ఊపిరితిత్తులు, ఇతర గుండె సంబంధిత సమస్యలు పెరుగుతాయని వెల్లడిచేస్తున్నారు. ఎయిర్ పొల్యూషన్‌ను రెగ్యులేట్ చేసేందుకు యాక్షన్ ప్లాన్ విశాఖలో సరైన పద్ధతిలో అమలు కావడం లేదన్నది స్పష్టమవుతోంది. జివిఎంసి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, జిల్లా పరిశ్రమల కేంద్రం, రవాణా శాఖ, పోలీస్, గనుల శాఖ కాలుష్య నివారణకు ఏ చర్యలు తీసుకుంటున్నాయో మోనటరింగ్, సమీక్షలను

మిగతా 2లో..

### చలికాలంలో కాలుష్యం పెరుగుతుంది

చలికాలంలో కొద్దిరోజులు కాలుష్యం అధికంగా ఉండడం సహజమే. ఎందుకంటే గాలి బయటకు పోవడానికి అవకాశం లేదు. నిధులు ఆయా శాఖలకే వస్తాయి. జివిఎంసి ట్రాఫిక్ కూడళ్లలో నియంత్రణ చేసే పనిచేయాలి. అమలు చేసే పని జివిఎంసిదే. పరిశ్రమల్లో ఎయిర్ క్వాలిటీ మానటరింగ్ ఉంది. గడిచిన సంవత్సరంలో ఏయే శాఖలు ఎంతవరకు రూ.100కోట్లలో ఖర్చుచేశాయో నాకు నివేదిక రాలేదు. నిధులు వచ్చినమాట నిజమే కానీ ఏ శాఖకు ఎంత వచ్చిందో సమాచారం లేదు. పిసిబికి మాత్రం నిధులు చాలా తక్కువ వచ్చాయి. విజయవాడకు అధికంగా వచ్చాయి.

**- రాజేంద్రరెడ్డి**

**కాలుష్య నియంత్రణ మండలి జోనల్ కమిషనర్**

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణలో...

# మోడీతో జగన్ కలిసిపోయారా?

**- 4వేల ఎకరాల భూమి ప్రతిపాదనపై వివరణ ఇవ్వాలి**

**- సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గంగారావు**

**ప్రజాశక్తి, ఎంవిపి కాలనీ :** విశాఖ స్టీల్‌ప్లాంట్ యొక్క 4 వేల ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వానికి కావాలని ఇటీవల స్టీల్ మంత్రిత్వశాఖ నిర్వహించిన డ్యాష్ బోర్డు సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించినట్లు వార్తలొస్తున్నాయని, దీనిని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు పేర్కొన్నారు. మద్దిలపాలెంలోని సిపిఎం కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 4 వేల ఎకరాలు భూమి ప్రతిపాదించటంపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కేంద్ర స్టీల్ మంత్రి నిర్వహించే డాష్‌బోర్డు సమావేశాలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎందుకు హాజరతున్నారో ప్రభుత్వం తెలియజేయాలని కోరారు. ఇప్పటికే కేంద్రంలోని బిజెపి సర్కారు టాటా స్టీల్, జెఎస్‌డబ్ల్యు, అదానీ, పోస్కో గ్రూపులతో ప్రీ-బిడ్డింగ్ సంప్రదింపులు నిర్వహించినట్లు, కంపెనీ వాల్యుయేషన్‌ను కూడా రహస్యంగా పూర్తిచేయడానికి కుట్రపన్నిందని వార్తలు వస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఆమోదంతోనే నరేంద్రమోడీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ 100శాతం వాటాలను అమ్మటానికి చక చకా పావులు కదుపుతున్నట్లు ఈ వార్తలు రుజువు చేస్తున్నాయని పేర్కొన్నారు ఒక వైపు స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకమంటూనే రెండోవైపు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో మిలాఖత్ అయి ప్లాంట్ అమ్మకానికి అంగీకరించటం రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేయడమేనన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్రమోడీని విశాఖకు రప్పించి కూడా స్టీల్ ప్లాంట్ అమ్మకంపై ప్రకటన చేయించలేకపోయారని విమర్శించారు. వారం రోజుల క్రితం దీపం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గంగారావు

మిగతా 2లో..

## ముఠా కార్మికులను కించపరిచే వారిపై చర్యలు

▶ వార్త 4లో..

## అమరజీవికి ఘన నివాళి

▶ వార్త 4లో..

## విశాఖ రైల్వే స్టేషన్‌లో ఉద్రిక్తత

▶ వార్త మెయిన్ 3లో..

# స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను జగన్ అడ్డుకోవాలి

**ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ :** విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటుపరం కాకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అడ్డుకోవాలని సిఐటియు పెందుర్తి జోన్ కార్యదర్శి జి.శంకరరావు డిమాండ్‌చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 623వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు పెందుర్తి జోన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ మిగిలు భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం కాకుండా చూడాల్సిన బాధ్యత కూడా జగన్మోహన్‌రెడ్డిపైనే ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యంత నాణ్యమైన స్టీల్ ఉత్పత్తి చేస్తున్న విశాఖ స్టీల్ కర్మాగారం, మరింత లాభాల్లో నడవడానికి సొంత గనులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.అప్పారావు, కె.ముత్యాలు, పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.




దీక్షలో కూర్చున్న సిఐటియు పెందుర్తి జోన్ నాయకులు

# ఎదురొడ్డి నిలబడిన స్కీం వర్కర్లు

**-పోరాటంతో పరిష్కరించుకుంటున్న సమస్యలు**

**-మహిళలకు ఆత్మస్థైర్యమిచ్చిన సిఐటియు**

**ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి**

గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న విఒఎలు, ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు అన్నం పెడుతున్న మధ్యాహ్నభోజన పథకం కార్మికులు, గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్న అంగన్‌వాడీలు, గ్రామాల్లో ఆరోగ్య పరిస్థితులకు వివరిస్తూ, డెలివరీ అయ్యే వరకు గర్భిణులను క్రమం తప్పకుండా ఆస్పత్రులకు తీసుకెళ్తున్న ఆశాలు ఏదో ఒకరోజు, ఏదో ఒక సందర్భంలో రాజకీయ వేధింపులు, బెదిరింపులకు గురికాకుండాలేరు. ప్రభుత్వ పథకాలు, వాటి ప్రాధాన్యతలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రభుత్వానికి గ ా ం ీ వ ం తెచ్చిపెడుతున్న ఈ స్కీం వర్కర్లకు ప్రభుత్వం కనీస గౌరవం ఇవ్వడంలేదు. నిత్యమూ రాజకీయ క్షక్ష సాధింపులు, తొలగింపులు, వేధింపులు, అవమానాలు, తొలగిస్తామన్న బెదిరింపులను భరించుకుంటూ, బాధలను దిగమింగుకుంటూ సేవలందిస్తున్న స్కీం వర్కర్లను ప్రభుత్వం గుర్తించకపోయినా వారి శ్రమను, సేవలను గుర్తించి వారికి సిఐటియు అండగా నిలిచింది. స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాలు అమలుచేయాలని సిఐటియు నాయకత్వంలో చేస్తున్న పోరాటంతో వీరికి కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయి.

అనకాపల్లి జిల్లా మిగతా 2లో..



ఆందోళన చేస్తున్న స్కీమ్‌వర్కర్లు (ఫైల్‌ఫొటో)



### స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి. పెన్షన్, గ్రాట్యూటీ సౌకర్యం కల్పించాలి. రిటైర్‌మెంట్ సదుపాయాలు అమలుచేయాలి. ప్రమాద బీమా కల్పించాలి. రాజకీయ వేధింపులు, తొలగింపులు నిలిపి వేయాలి.



**ఆర్.శంకరరావు,**
**సిఐటియు అనకాపల్లి**
**జిల్లా అధ్యక్షులు**

## మొదటి పేజీ తరువాయి..

### కాలుష్యంపై ఖర్చుకు లెక్కాపత్రం ఎక్కడ?

జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పై అధికారుల కమిటీ సమీక్ష చేయాల్సి ఉన్నా జరగడం లేదు. కాలుష్య నియంత్రణ బోర్డు జోనల్ కార్యాలయ అధికారుల్లో కాలుష్య నివారణ విషయమై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నిధుల లెక్కపై మీనమేషాలు లెక్కిస్తున్నారు.

### మోడీతో జగన్ కలిసిపోయారా?

సెక్రటరీ ప్లాంట్‌ను అమ్మి తీరుతామని ప్రకటించినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు. రెండోవైపు ఉక్కు ఉద్యమంలో చీలికలు తీసుకురావడానికి బిజెపి ఎంపీ జివిఎల్ నర్సింహరావును విశాఖకు ప్రత్యేకంగా నరేంద్రమోడీ పంపించారని తెలిపారు. ప్లాంట్‌ను వేగంగా అమ్మటానికి, ఎటువంటి ఆటంకాలు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవటానికి ఉక్కు ఉన్నతాధికారులతో చర్చలు జరుపుతున్నారని పేర్కొన్నారు. ఉక్కు మంత్రిని కలిసి మెమోరాండాలు ఇవ్వడం, పార్లమెంటులో ప్రశ్నలు లేవనెత్తడం తదితరాలన్నీ స్టీల్ ప్లాంట్ అమ్మకంకోసమే ఒక కుట్రతో చేస్తున్నారని విమర్శించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ప్లాంట్‌ను తీవ్ర నష్టాలు పాల్జేయడానికి కేంద్ర బిజెపి సర్కార్ స్టీల్ ఉత్పత్తిని 50శాతం తగ్గించేసిందని, బ్లాస్టఫర్నేస్‌ను మూసివేసిందని, బొగ్గు సరఫరాకు ఆటంకాలు కల్పించిందని తెలిపారు. ఈ ఏడాది ప్లాంట్‌కు రూ.3వేల కోట్ల పైబడి నష్టాలు తీసుకురావాలని బిజెపి కుట్రతో వ్యవహరిస్తోందని విమర్శించారు. నష్టాలు తీసుకొచ్చి విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ప్రజల్లో వ్యతిరేకత సృష్టించి అమ్మేయాలనే వ్యూహాత్మక కుట్ర ఇందులో దాగి ఉందన్నారు. ఇంత దారుణం జరుగుతున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించటం లేదంటే ఇవన్నీ ఆయన ఆమోదంతోనే జరుగుతున్నాయని అర్థం చేసుకోవచ్చున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దీపం సమావేశాలకు హాజరవుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు తక్షణం అన్ని రాజకీయపక్షాలను సమావేశపర్చాలని, ప్రధానమంత్రిని అఖిలపక్ష పార్టీలతో కలవాలని కోరారు. ప్లాంట్‌ను విక్రయించే చర్యలను ఉపసంహరించకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఎదురొడ్డి నిలబడిన స్కీం వర్కర్లు

సిఐటియు 12వ మహాసభలు ఈ నెల 18, 19న పరవాడలో జరుగుతున్న నేపథ్యంలో స్కీం వర్కర్ల సమస్యలపై సిఐటియు నిర్వహించిన పోరాటాలను ఆత్మావలోకనం చేసుకున్నప్పుడు అది ఎన్నో విజయాలను సొంతం చేసుకుంది. బిక్కుబిక్కుమంటూ పనిచేస్తున్న స్కీం వర్కర్లకు ధైర్యమివ్వగలిగింది. ప్రభుత్వం సకాలంలో గౌరవ వేతనం, జీతాలు చెల్లించకపోయినా, రవాణా, ఇతర బిల్లులు ఇవ్వకపోయినా చేతిలో డబ్బులు పెట్టుకుంటూ వీరంతా సేవలందిస్తున్నారు. ఇటువంటి వారిపట్ల సానుకూలంగావుంటూ సానుభూతితో వారి సమస్యలను అర్థంచేసుకొని ఉద్యోగ భద్రత కల్పించాల్సిన ప్రభుత్వాలు నిత్యమూ ఇబ్బందులకు గురిజేస్తూనేవున్నాయి. ఇటువంటి ప్రతి సందర్భంలోనూ సిఐటియు జోక్యం చేసుకొని, వారందరినీ ఐక్యపర్చి న్యాయమైన సమస్యల సాధన కోసం పోరాటాలు చేపట్టింది. మూడేళ్ల కాలపరిమితి పూర్తయిందన్న కారణంతో విఒఎలను, పురుషులను తొలగించాలన్న ప్రభుత్వ సర్క్యులర్ అమలుకాకుండా పోరాటంతో వారు అడ్డుకోగలిగారు. ప్రభుత్వ బడుల్లో పేద పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం కింద వండిపెడుతున్న కార్మికులకు కనీస వేతనం, సామాజిక భద్రతలేని పరిస్థితుల్లో పనిచేస్తూ పేద పిల్లల మెనూ ఛార్జీలు పెంచాలని చేసిన పోరాటంతో ఫలితమొచ్చింది. మెనూ ఛార్జీలు ప్రభుత్వం పెంచింది. మధ్యాహ్న భోజన పథకం ప్రయివేటు సంస్థల పరంకాకుండా ఎదురొడ్డి కార్మికులు అడ్డుకోగలుగుతున్నారు.

నూతన విద్యా విధానం రద్దు, అంగన్‌వాడీ కేంద్రాలను పాఠశాలల్లో విలీనంకాకుండా ఆపాలని, 400 జనాభా దాటిన మినీ అంగన్‌వాడీలను ప్రధాన కేంద్రాలుగా మార్చాలని, మెయిన్ వర్కర్సుతో సమానంగా మినీ వర్కర్లకు వేతనం చెల్లించాలని పోరాడింది. అర్హులైన అంగన్‌వాడీలకు సూపర్‌వైజర్ ప్రమోషన్లు ఇవ్వాలన్న పోరాటం విజయంసాధించింది. పనిని బట్టి పారితోషికం ఇచ్చే పద్ధతి నుంచి నెలకు పదివేలు వేతనం ప్రభుత్వం చెల్లించేలా ఆశా వర్కర్లు పోరాడారు. పదివేల వేతనం సాధించుకున్నారు.

### క్రిస్టియన్ భూములు అన్యాక్రాంతంపై పోరాడాలి

**ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ :** నగరంలో వందల కోట్ల విలువైన క్రిస్టియన్ మైనారిటీ సంస్థల భూములు అన్యాక్రాంతం కాకుండా పోరాడాలని టిడిపి క్రిస్టియన్ మైనార్టీ విభాగం నాయకులకు ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 20న క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో జరగనున్న గ్రాండ్ క్రిస్మస్ పోస్టర్‌ను గురువారం టిడిపి కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉరుకుటి డేవిడ్, పాత్రపల్లి రాజ్ కుమార్, చిన్ని రాజ్‌కుమార్, ఉమాశంకర్ చౌదరి, వినోద్ కుమార్, కృష్ణంరాజు, సాల్మన్, తిమోతి తదితరులు పాల్గొన్నారు.

31వ వార్డులో గడపగడపకు....

# వైసిపి నేతల డుమ్మా

**ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ :** ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ దక్షిణ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం మిగిలిన వార్డులలో ఎలా ఉన్నప్పటికీ 31వ వార్డులో మాత్రం వైసిపి కార్యకర్తలు రావటం లేదు. వార్డు స్థాయి నాయకులు, ముఖ్య కార్యకర్తలు ముఖం చాటేస్తున్నారు. నాలుగు రోజులుగా ఈ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తున్నారు. జివిఎంసి జోన్ 4 అధికారులు, వార్డు సచివాలయ ఉద్యోగులు మాత్రమే వస్తున్నారు. ఈ వార్డు కార్పొరేటర్ బిపిన్ కుమార్ జైన్ వ్యవహార శైలి నచ్చనందునే వైసిపి దిగువ స్థాయి నాయకులు హాజరు కావడం లేదని తెలిసింది. గురువారం వార్డులోని భాను స్ట్రీట్, అస్సాం

#### ఎమ్మెల్యే వాసుపల్లికి సహకరించని పలువురు కార్పొరేటర్లు

గార్డెన్స్ ప్రాంతాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. వార్డు పర్యటనలో సమస్యలపై స్థానికులు ఎమ్మెల్యేను, కార్పొరేటర్‌ను నిలదీస్తున్నారు. ప్రజల నుంచి ఎటువంటి తిరుగుబాటు వస్తుందోనని, గమనించి టూ టౌన్ పోలీసులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఇదే నియోజకవర్గం లోని మరికొన్ని వార్డుల్లో కూడా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహణలో వార్డు కార్పొరేటర్లు సైతం హాజరుకాని పరిస్థితి ఉంది. 39, 29, 32 వార్డుల కార్పొరేటర్లు ఎమ్మెల్యేకు సహకరించని పరిస్థితి నెలకొంది. 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ప్రారంభంలో ఎమ్మెల్యే గణేష్ కుమార్‌తో విభేదించినప్పటికీ, ఇటీవల తన వార్డులో పలు కార్యక్రమాలను నిర్వహిస్తూ ఎమ్మెల్యే గణేష్ కుమార్‌ను తప్పనిసరిగా భాగస్వామి చేస్తున్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జరుగుతున్న తీరు పట్ల పార్టీ అధిష్టాన వర్గం ఒకింత ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితం పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవిసుబ్బారెడ్డిని ఎమ్మెల్యే గణేష్ కుమార్ కలిసి నియోజవర్గంలో కొందరు వైసిపి కార్పొరేటర్లు, వార్డు స్థాయి నాయకులు వ్యవహరిస్తున్న సహాయనిరాకరణ తీరును వివరించినట్లు తెలిసింది.

### నేటి నుంచి ఐఎస్ఎఎంఇ ఫోరం సమావేశాలు

**ప్రజాశక్తి, ఎంవిపి కాలనీ :** లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ యొక్క 50 ఐఎస్ఎఎంఇ ఫోరం 2022 సమావేశాలు లయన్స్ మల్టిపుల్ డిస్ట్రిక్ట్ 316 ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు విశాఖలోని రాడిసన్ బ్లూ హోటల్ నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ బ్రెయిన్ శీహన్ తెలిపారు. ఈ మేరకు బీచ్ రోడ్‌లోని నోవాటెల్ హోటల్లో మీడియా సమావేశం ఏర్పాటుచేసి వివరాలు వెల్లడించారు. ఈ సమావేశాలకు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 1800 మంది పాల్గొంటారని తెలిపారు. చివరి రోజున మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో థర్డ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఏపీ సింగ్, సమావేశాల హోస్ట్ కమిటీ చైర్‌పర్సన్ విజయ్ కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

### వికలాంగులకు ఉపకరణాల పంపిణీ

**ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ :** శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్, శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ న్యూస్ అకాడమీ సంయుక్తంగా మహారాణిపేటలోని ప్రకృతి చికిత్సాలయంలో గురువారం వికలాంగులకు ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ వికలాంగుల, వయోవృద్ధుల శాఖ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఎంఎస్.ముంతాజ్ పఠాన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వికలాంగుల కోసం కేంద్ర ప్రభుత్వంతో కలిసి అనేక పథకాలను అందిస్తున్నారని తెలిపారు. రాబోయే కాలంలో ప్రభుత్వం వికలాంగుల కోసం ఓ ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్, ట్రస్ట్ ప్రతినిధి జగదీష్‌బాబు, డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, డాక్టర్ ఎస్. లక్ష్మీనారాయణ, డాక్టర్ లక్ష్మణరావు, రూపాకుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 'జగన్‌ను ముఖ్యమంత్రి చేయడం దౌర్భాగ్యం'

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ :** జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఎన్నుకోవడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యం అని మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అన్నారు. బిజెపి కార్యాలయంలో గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు సమయానికి జీతాలు పొందలేని పరిస్థితి దాపురించిందని విమర్శించారు. ఈ సమస్యపై గవర్నర్ వెంటనే స్పందించి రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హంతకుడు అనంత బాబుకు వైసిపి నేతలు స్వాగతం పలకడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

## శారదాపీఠాన్ని సందర్శించిన దేవాదాయ మంత్రి

ప్రజాశక్తి పెందుర్తి : విశాఖ శారదా పీఠాన్ని దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కమిషనర్ హరి జవహర్‌లాల్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాచీన ఆలయాల పునరుద్ధరణ, అర్చకుల వేతనాలు, వంశపారంపర్య హక్కులు తదితర ఇబ్బందులను తొలగించాలని, రాయలసీమలోని కదిరి, కసాపురం తదితర క్షేత్రాల్లో భక్తులకు వసతి సమస్య పరిష్కరించాలని పీఠాధిపతులు స్వరూపా నందేంద్ర సరస్వతితో స్వామి సూచించగా, కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఆలయ భూముల పరిరక్షణలో రాజీ పడబోమని మంత్రి సత్యనారాయణ స్పష్టం చేశారు.

## ఆటోనగర్‌లో వర్మీ కంపోస్ట్ షెడ్ ప్రారంభం

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్ ఈ బ్లాక్‌లో ఐలా ఆధ్వర్యంలో వర్మీ కంపోస్ట్ షెడ్‌ను జోనల్ మేనేజర్ రంగయ్య గురువారం ప్రారంభించారు. సేకరించిన చెత్తతో ఈ షెడ్‌లో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తామని, ఇది విజయవంతమైతే ఇతర ప్రాంతాల్లో మరిన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఐలా కమిషనర్ సూర్యనారాయణ, ఐలా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## వెంటనే వేతన ఒప్పందం చేయాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు కార్మికులకు వెంటనే నూతన ఒప్పందం అమలు చేయాలని ఉక్కు శ్రామిక సంఘం సమావేశంలో యూనియన్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ కరణం బాలయోగి కోరారు. సెయిల్ తో సమానంగా విశాఖ ఉక్కు కార్మికులకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కరణం సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బొడ్డు పైడిరాజు, కరణం సత్యారావు, మామిడి అప్పారావు, యమ్ కోటేశ్వరరెడ్డి, పెనుమర్తి బాలాజీ,చట్టి. అప్పారావు, బొడ్డు రమణ సమ్మిడి రాజు, జి నూకరాజు, యమ్ ప్రకాష్ యాదవ్ పాల్గొన్నారు.

## ధ్యాన మందిరం ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : 13వ వార్డు ఆరిలోవ కాలనీ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వద్ద ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ నూతనంగా నిర్మించిన ధ్యాన మందిరాన్ని గురువారం నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత ప్రారంభించారు. వార్డు వైసిపి ఇన్‌ఛార్జి కెల్ల సత్యనారాయణ, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మోహనరావు, మూర్తి, ఈశ్వరరావు, వైసిపి నేతలు పిల్లి వీర్రాజు, వెంకట రెడ్డి పాల్గొన్నారు.

## సమస్యలపై కమిషనర్‌కు వినతి

ప్రజాశక్తి- గాజువాక: 65వ వార్డులోని ప్రధాన సమస్యలపై జివిఎంసి కమిషనర్ పి రాజాబాబుకు స్థానిక కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు గురువారం నివేదించారు. ప్రధానంగా వార్డులోని శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని కోరారు. శ్మశానవాటికలో గ్రీనరీ పెంపు, సిమెంట్ బల్లల ఏర్పాటు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. పలు కాలనీల్లోని పార్కులను ఆధునీకీకరించి, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని కోరారు.

## బడుగులకు రాయితీ రుణాలివ్వాలి

ప్రజాశక్తి -కంచరపాలెం : ఎస్‌సి,ఎస్‌టి, బిసి, మైనార్టీల సంక్షేమానికి సబ్‌ప్లాన్ అమలుతో పాటు వారికి సబ్సిడీ రుణాలు అందజేయాలని ఏపి బిసి సంక్షేమ సంఘం కన్వీనర్ డాక్టర్ సనపల లక్ష్మీనర్సింహ అన్నారు. గురువారం 51వ వార్డు అంబేద్కర్‌నగర్, వుడా కాలనీ, మాధవధార తదితర ప్రాంతాల్లో జనజాగృతి యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఆర్అండ్‌బి జంక్షన్ వద్ద పైడితల్లమ్మను దర్శించుకున్నారు. అంబేద్కర్ నగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనజాగృతియాత్రలో సమీకరించిన సమస్యల పరిష్కారానికి సిఎం జగన్‌ను కలిసి నివేదిస్తానని వెల్లడించారు.

## సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్

ప్రజాశక్తి- సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె.రాజు గురువారం గ్రీవెన్స్ నిర్వహించారు. హౌసింగ్, పెన్షన్లు, ఇతర వ్యక్తిగత సమస్యలతోపాటు సామాజిక సమస్యలపై అర్జీలను స్వీకరించి, కొన్నింటిని అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. మిగిలిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని అర్జీదారులకు భరోసానిచ్చారు. 14వ వార్డు కార్పొరేటర్ కె. అనిల్‌కుమార్‌రాజు, కిరణ్‌రాజు, వార్డు అధ్యక్షుడు పైడి రమణ, నీలి రవి, షేక్ జుబైర్ పాల్గొన్నారు.

# విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి -భీమునిపట్నం : విద్యారంగ అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం తొలి ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం రూ.నాలుగు కోట్ల రూసా నిధులతో నిర్మించిన స్థానిక ఎస్‌విఎల్‌ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశా నూతన భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిధుల లేమితో సగంలోనే నిలిచిన మరుగుదొడ్లను పూర్తిచేయాలని, కాలేజీకి అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల విజ్ఞప్తి చేశారు. 2009 నుంచి ఖాళీగా ఉన్న బయోలజీ, జువాలజీ, కెమిస్ట్రీ అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి దంతులూరి వెంకటశివ సూర్యనారాయణ రాజు, జెడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు, ఎఎంసి చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, జివిఎంసి కోఆప్షన్ సభ్యులు కొప్పల ప్రభావతి, జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణ, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, ఎంపిటిసి చెల్లూరి నగేష్‌బాబు, వైసిపి నేతలు కొప్పల రమేష్, పొట్నూరు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -భీమునిపట్నం: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన పిఎస్ఎం, జీవిఎంసి, హైస్కూల్ విద్యార్థులను హెచ్ఎం, తిరుమల శ్రీదేవి, పిఇటి పి.లక్ష్మి అభినందించారు. అండర్ -17బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని జి.అశ్విత, .బాలుర విభాగంలో విద్యార్థి సిహెచ్ గౌతంరాజు, అండర్ -14 బాలికల విభాగంలో 8 వ తరగతి విద్యార్థిని స్నేహప్రియ రాణించి, రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

## బాక్సింగ్‌లో లిఖితకు బంగారం

ప్రజాశక్తి-ఉక్కునగరం : జిల్లాస్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌పోటీల్లో 53కిలోల విభాగంలో అగనంపూడి ఉన్నతపాఠశాల 9వ తరగతి విద్యార్థిని సాయి లిఖిత బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఉక్కునగరంలో శ్రీనివాసరావు అనే కోచ్ వద్ద శిక్షణ పొందిన లిఖిత, ఈ నెల 13న జరిగిన సబ్ జూనియర్ కేటగిరీలో 50, 53 కిలోల కేటగిరీలలో జిల్లా స్థాయి పోటీల్లో పతకాన్ని సాధించినట్లు తెలిపారు. లిఖితను హైస్కూల్ హెచ్ఎం కృష్ణారావు, ప్రసాద్, కృష్ణవేణి తదితరులు అభినందించారు.

## బీమా తక్షణ సాయం అందజేత

ప్రజాశక్తి -తగరపువలస :మండలంలోని టి నగరపాలెం పంచాయతీ, గొల్లలపాలేనికి చెందిన పల్లా గురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వైఎస్ఆర్ బీమా కింద తక్షణసాయంగా మృతుని భార్య నామినీగా ఉన్న మంగమ్మకు రూ.పది వేలను సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి గురువారం అందించారు. ఎంపిటిసి సభ్యులు పల్లా నీలిమ, వైసిపి బిసి సెల్ మండల అధ్యక్షులు పొట్నూరు చంద్రశేఖర్, నాయకులు పల్లా సన్యాసిరావు పాల్గొన్నారు.

## ఇంధన పరిరక్షణపై వ్యాసరచన

ప్రజాశక్తి -గాజువాక :గిరీష్ విద్యానికేతన్ పాఠశాలలో ఇంధన పరిరక్షణపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు పెదగంట్యాడ ఎలక్ట్రికల్ ఎఇ చెల్లి రిషికేష్ బహుమతులను అందజేశారు.కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ భీమిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు

## చిరస్మరణీయుడు బాపు

ప్రజాశక్తి-ములగాడ: తెలుగు చిత్రకారుడు బాపు సేవలు చిరస్మరణీయమని చిత్రకారుడు, రచయిత సుంకర చలపతిరావు అన్నారు, గురువారం మల్కాపురం శాఖ గ్రంథాలయంలో బాపు 89వ జయంతి సందర్భంగా. బాపు చిత్రపటానికి పౌర హక్కుల నేత పంపాల శ్రీరామమూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అజయ్ కుమార్, సత్తిరాజు, బి..సత్యానందం, డి.మనోహర్, పాల్గొన్నారు.

## అర్హులందరికీ జగనన్న ఇళ్లు

ప్రజాశక్తి- గాజువాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న ఇల్లు మంజూరు చేస్తామని 74వ వార్డు కార్పొరేటర్, తిప్పల వంశీరెడ్డి అన్నారు. గురువారం వార్డు పరిధిలోని నెహ్రూనగర్ సచివాలయంలో లబ్ధిదారులకు రెండోవిడత ఇళ్లస్థలాల పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ ఎడ్మిన్ స్వరాజ్, ఇతర సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి -ములగాడ: 40వ వార్డు ఎకెసి కాలనీ సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు గురువారం ఇళ్లస్థలాల పట్టాలను కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థికసాయాన్ని సద్వినియోగం చేసుకుని, ప్రతిఒక్కరూ సొంతింటి కలను సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు రాజాబాబు, సోయల్ పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-ములగాడ : 61వ వార్డు, ప్రియదర్శిని కాలనీలో రూ.ఏడు లక్షలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ పరిశీలించారు. జివిఎంసి వర్క్ఇన్‌స్పెక్టర్ రమేష్‌కు కొన్ని సూచనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు చట్టి నూకరాజు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -పిఎం పాలెం : పిఎం.పాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని గాయత్రినగర్, బాబానగర్, పిలకవాని పాలెం, కార్‌షెడ్ జంక్షన్, సాంకేతిక కాలేజీ తదితర ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎఇ డి.సురేష్ తెలిపారు.

# టిడిఆర్ సమస్యలకు సత్వరమే పరిష్కారం



అధికారులకు సూచనలు చేస్తున్న జివిఎంసి కమిషనర్

ప్రజాశక్తి-పిఎం పాలెం: రెండో జోన్ పరిధిలో టిడిఆర్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జివిఎంసి కమిషనర్ పి రాజాబాబు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. గురువారం జోన్ పరిధిలోని మధురవాడ, బక్కన్నపాలెం, నవోదయ జంక్షన్, రేవలపాలెం, కొమ్మాది, నగర పాలెం, వాంబే కాలనీ, ఎండాడ తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్లను నిర్మించాలని, ఏదైనా సమస్య తలెత్తితే సంబంధిత ఏరియా ఎంఎస్‌సి, తహశీల్దార్లతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరపాలెం రోడ్డు విస్తరణకు సంబంధించి, పెండింగ్ లో ఉన్న 31 మంది టిడిఆర్ సమస్యలను వారితో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ఎండాడ చెరువులోని పూడికలను తొలగించాలని స్థానిక కార్పొరేటర్ లోడగల అప్పారావు కమిషనర్ దృష్టి తేగా, వెంటనే పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. పర్యటనలో పట్టణ ప్రణాళిక అధికారి సురేష్, డిసిపి పద్మజ, ఎసిపి శాస్త్రి, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

### భర్తను హతమార్చిన భార్య

ప్రజాశక్తి- పెందుర్తి : 95వ వార్డు లక్ష్మీపురంలో దారుణం చోటుచేసుకుంది. కట్టుకున్న భర్తనే ఒక ఇల్లాలు కడతేర్చిన ఘటన స్థానికంగా కలకలం రేపింది.వివరాలివి. లక్ష్మీపురం ఫ్లైఓవర్ పక్కన నివాసముంటున్న కే.రాజేశ్వరి, భర్త నాగేశ్వరరావుతో విభేదాలతో కొన్నాళ్లుగా దూరంగా ఉంటోంది. వీరి మధ్య కోర్టు కేసు కూడా నడుస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి రాజేశ్వరి వద్దకు వచ్చిన నాగేశ్వరరావు కేసు విత్ డా చేసుకోవాలని, లేకుంటే అంతు చూస్తానని హెచ్చరించారు. ఇరువురి మధ్య వాదోపవాదాలు తీవ్రమైన క్రమంలో కోపోద్రిక్తురాలైన రాజేశ్వరి అక్కడే ఉన్న ఇనుపరాడ్‌తో నాగేశ్వరరావు తలపై కొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. తానే చంపినట్లు రాజేశ్వరి ఒప్పుకోవడంతో ఆమెను అదుపులోకి తీసుకున్నారు. భార్యాభర్తల గొడవలతో ఇద్దరు చిన్నారులు ఇపుడు అనాథలుగా మిగిలిపోయారు.

### పోలీసులపై దాడికి యత్నించిన యువతి అరెస్ట్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : బీచ్ రోడ్డులో పోలీసులపై దాడికి యత్నించిన యువతి అమూల్యను అరెస్టుచేశారు. బీచ్ రోడ్డులో వైఎంసిఎ వద్ద బుధవారం రాత్రి సుమారు 11:20 గంటల సమయంలో బీరు తాగుతూ, సిగరెట్ కాల్చుతూ కనిపించిన యువతి అమూల్యను నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ పివి సత్యనారాయణ మందలించి ఇంటికి వెళ్లాలని కోరారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న అమూల్య ఎస్ఐను అసభ్య పదజాలంతో తిట్టడంతో బీర్ బాటిల్‌తో కొట్టబోయింది. యువతి విసిరిన బాటిల్ పక్కనే ఉన్న గోవింద్‌కు తగలడంతో కంటి వద్ద గాయమైంది. అనంతరం ఎస్ఐ వద్దకు వచ్చి భుజంపై ఉన్న షోల్డర్‌ను లాగి, కళ్లద్దాలు ధ్వంసం చేసింది. నైట్ రౌండ్స్ జోనల్ అధికారి ఫోర్త్ టౌన్ సిఐ శ్రీనివాసరావు, మహారాణిపేట మహిళా ఎస్ఐ లక్ష్మి సంఘటన స్థలానికి చేరుకొని అమూల్యకు డ్రంక్ టెస్ట్ నిర్వహించారు. 148.1 ఎంజి రీడింగ్ వచ్చింది. బహిరంగప్రదేశంలో మద్యం తాగడమే కాకుండా విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ అధికారిపై దాడి చేసిన కేసులో అమూల్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## అంగన్వాడీ చిన్నారికి చురకలుపై ఆగ్రహం

ప్రజాశక్తి- సీతమ్మధార: నగరంలోని సీతంపేట కనకమ్మవారివీధి అంగన్వాడీ కేంద్రంలోని అల్లరి చేస్తోందన్న కారణంతో మూడున్నరేళ్ల చిన్నారికి అక్కడి ఆయా అగ్గిపుల్లతో చురకలు పెట్టడంపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి, సిడిపిఒలు శ్రీలత, రమణకుమారిలతో సంబంధిత అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించారు. బాలిక ముఖంపై ఉన్న చురకలను పరిశీలించి, తక్షణ వైద్యసేవలకు ఆదేశించారు. ఘటనపై 24గంటల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.బాధ్యులపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో కమిషన్ కార్యాలయానికి నివేదిక పంపాలని కలెక్టర్, ఐసిడిఎస్ పీడీ, ఇతర అధికారులను ఆదేశించారు. పర్యవేక్షక అధికారి ఉమాజానకి పాల్గొన్నారు.

## వైసిపి పాలనలో కుంటుబడిన అభివృద్ధి

ప్రజాశక్తి-ఆనందపురం : వైసిపి పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుబడిందని భీమిలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కోరాడ రాజాబాబు ఆరోపించారు తర్లువాడలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా తాత్రాజు అప్పారావు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రచ్చబండలో సమస్యలపై చర్చ జరిపారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రెసిడెంట్ బొద్దాపు శ్రీనివాస్, కసిరెడ్డి దామోదర్, మీసాల సత్యనారాయణ, పద్మనాభం ఎంపిటిసి కంటుబోతు ఎర్రనాయుడు, మజ్జి సన్యాసిరావు, టి.నరసింహ, తాత్రాజు అప్పలరామస్వామి, బసన అప్పలరాజు, టి అప్పలరాజు, గుండు చిన్నబాబు, కంటుబోతు సుమంత్ నాయుడు పాల్గొన్నారు.

## 18,19 తేదీల్లో పంచకర్మ వైద్యశిబిరం

ప్రజాశక్తి -కంచరపాలెం : దీర్ఘకాల రోగాలతో బాధపడే వారికి పంచకర్మ ఆయుర్వేద విధానం ద్వారా చికిత్స అందించేందుకు ఈ నెల 18, 19 తేదీల్లో మురళీనగర్ శ్రీదేవి పార్క్ సమీపంలోని తమ కేంద్రంలో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు కేరళ ఆయుర్వేద కేంద్రం వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినుప్ తెలిపారు. ప్రముఖ కేరళ వైద్యులు డాక్టర్ కెయం.ఉన్నికృష్ణన్ నాయర్ రెండు రోజుల పాటు శిబిరంలో రోగులకు సేవలందిస్తారన్నారు. అపాయింట్‌మెంట్‌కు 90305 68264 సంప్రదించాలన్నారు.

## ఐద్వా నేత గోవిందమ్మకు ఘననివాళి



గోవిందమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విమల, తదితరులు

ప్రజాశక్తి -ములగాడ : ఐద్వా నేత టి. గోవిందమ్మ నాలుగో వర్ధంతిని 62వ వార్డు త్రినాథపురంలో గురువారం నిర్వహించారు. గోవిందమ్మ చిత్రపటానికి ఐద్వా రాష్ట్ర నేత ఆర్ విమల, మల్కాపురం జోన్ నాయకులు కె.అన్నపూర్ణ, వరలక్ష్మి, బి రాజేశ్వరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, ఐద్వా రాష్ట్ర నేత ఆర్.విమల తదితరులు మాట్లాడుతూ గోవిందమ్మ సేవలను కొనియాడారు. ఆమె మరణం పార్టీకి ఐద్వా సంఘానికి తీరనిలోటన్నారు. సిపిఎం జోన్ నేత, గోవిందమ్మ భర్త టి.అప్పారావు మాట్లాడుతూ గోవిందమ్మ ప్రోత్సాహంతోనే తానీ స్థాయికి చేరానన్నారు. సిపిఎం మల్కాపురం జోన్ నేత పిసిని రామారావు అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్ష కార్యదర్శులు కె.పెంటారావు ఆర్ లక్ష్మణమూర్తి, డివైఎఫ్ఐ జోన్ కార్యదర్శి ఎస్ వాసు ఐద్వా ఏరియా నాయకులు కె. అన్నపూర్ణ

## సిఐటియు జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ




పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి -తగరపువలస : ఈ నెల 22, 23 తేదీల్లో డాబాగార్డెన్స్, అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరగనున్న సిఐటియు విశాఖ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ భీమిలి జోన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నరసింగరావు కార్మికులకు పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక యూనియన్ కార్యాలయం వద్ద మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు, భీమిలి జోన్ కమిటీ సభ్యులు సిహెచ్ రాము, ఎం ఈశ్వరరావు, వి నాగరాజు, నాయుడు, సోమి వెంకట్, పాల్గొన్నారు.

## ప్లాంట్ భద్రత విషయంలో రాజీ లేదు



కార్మిక నేతలతో సిఐఎస్ఎఫ్ కమాండెంట్

ప్రజాశక్తి-ఉక్కునగరం :విశాఖ స్టీల్‌ప్లాంట్ సిఐఎస్ఎఫ్ కమాండెంట్ అత్తార్ మహ్మద్ హనీఫ్‌తో ఉక్కు కార్మిక సంఘ నేతలు భేటీఅయి పలు కీలక విషయాలపై చర్చించారు. ప్లాంట్ భద్రత, గేట్ల వద్ద ఉద్యోగులు సులభంగా ప్రవేశ, నిష్క్రమణకు తీసుకుంటున్న జాగ్రత్తలు, ప్లాంట్‌లో విభాగాల వద్ద సిబ్బంది నియామకం వంటి విషయాలపై చర్చించారు. ఉద్యోగులకు ఇబ్బంది కలిగే చర్యలు తీసుకోవద్దని కోరారు.దీనిపై అత్తార్ మహ్మద్ స్పందిస్తూ, ప్లాంట్ భద్రత విషయంలో రాజీ లేదని, కలర్‌జెరాక్స్ గుర్తింపు కార్డులతో ప్లాంట్‌లోకి ఎవరిని అనుమతించబోమని స్పష్టం చేశారు. కమాండెంట్‌ను కలిసిన వారిలో కార్మిక నేతలు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరాం, కెఎస్ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, వై.మస్తానప్ప, డివీరమణ, బి.అప్పారావు, దొమ్మేటి అప్పారావు, కొమ్మినేని శ్రీనివాసరావు, వెంకటరాజు, టి.సత్యనారాయణ, రామకృష్ణ, ఈశ్వరరావు, జీవీ.సుబ్బయ్య, గంగవరం గోపి, పెంటారావు ఉన్నారు.

## ముఠా కార్మికులను కించపరిచే వారిపై చర్యలు

ప్రజాశక్తి- సీతమ్మధార: ముఠా కార్మికుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా దుష్ప్రచారం చేస్తున్న గుంటూరు న్యూ ఆంధ్ర మోటార్స్, ట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు డిమాండ్ చేశారు. గురువారం అక్కయ్యపాలెం కార్మికశాఖ కార్యాలయం వద్ద ముఠా కార్మికులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచాలని ముఠా కార్మికులు నిత్యం పోరాటాలు సాగిస్తూనే ఉన్నారని, అంతేకాక కడప మార్బుల్స్ వంటి బరువైన వస్తువుల అన్‌లోడింగ్‌లోకార్మికుల కష్టానికి అనుగుణంగా వేరే రేట్లు నిర్ణయించబడతాయన్నారు. దీనిపై న్యూ ఆంధ్ర మోటార్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు వై రాజు, టీ పైడిరాజు, తాతారావు పాల్గొన్నారు.




ధర్నా చేస్తున్న ముఠా కార్మికులు

## ఇపిఎఫ్ పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో తాత్సారం



మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం నేత సుధాకర్

ప్రజాశక్తి -పిఎం పాలెం: ఇపిఎఫ్ పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు తాత్సారం చేయడం తగదని ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కొమ్మాదిలోని సంఘ కార్యాలయంలో ఎంవిఆర్ పాత్రుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, విశ్రాంత ఉద్యోగుల జీవనానికి సరిపడా పెన్షన్ ఇవ్వాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆర్‌సి గుప్త కేసులో తీర్పును అందరికీ వర్తింపజేయాలన్నారు. ఈ నెల 7,8 తేదీల్లో ఢిల్లీలో విజయవంతమైన పెన్షనర్ల ధర్నాకు ఎనిమిది మంది ఎంపీలు మద్దతునిచ్చారన్నారు. సంఘం విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డిపల్లి బాబూరావు మాట్లాడుతూ ఇపిఎఫ్ పెన్షన్‌దారులకు కనీస పింఛను నెలసరి రూ. తొమ్మిది వేలు చెల్లించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కరువుభత్యాన్ని పెంచాలని కోరారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిసిసి రిటైర్ ఉద్యోగి, సీనియర్ నాయకుడు భానుప్రకాష్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్.నాగేంద్ర, ప్రసాద్, ఎ. అప్పారావు, భవానీశంకర్ పాల్గొన్నారు.

## 'హయగ్రీవ' కబ్జాదారులకు నోటీసులు అభినందనీయం

ప్రజాశక్తి- సీతమ్మధార : రూ.500 కోట్ల విలువైన హయగ్రీవ స్థలాలకు సంబంధించి కబ్జాదారులకు జిల్లా కలెక్టర్ మల్లికార్జున నోటీసులు ఇవ్వడం అభినందనీయమని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అన్నారు. గురువారం పౌరగ్రంథాలయంలో విలేకరుల సమావేశంలో కబ్జాదారులకు ఇచ్చిన నోటీసులను చూపించి, కలెక్టర్ చర్యలను అభినందించారు. ఎండాడ గ్రామంలోని సర్వే నంబర్ 92/3లో 12.51 ఎకరాల హయగ్రీవ భూముల కుంభకోణంపై ఏడాదిగా జనసేన ఆందోళన చేస్తోందన్నారు. హయగ్రీవ భూముల అనుమతులను రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ నోటీసులు ఇస్తే జీవీఎంసీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. కమిషనర్‌గా రాగానే హయగ్రీవ భూములపై చర్యలు తీసుకుంటామని చెప్పిన రాజాబాబు, ఇంతవరకు సంబంధిత పనులను ఎందుకు నిలిపేయలేదని ప్రశ్నించారు. క్రైస్తవ ఆస్తుల ముసుగులో సిబిసిఎన్‌సి, సోషల్ వెల్ఫేర్ స్థలాలను ఎంవివి, జీవిలు కబ్జా చేస్తుంటే తూతూమంత్రంగా బోర్డు పెట్టి చేతులు దులుపుకున్నారని, ప్రభుత్వ భూములకు రక్షణగా ఉండాల్సిన కమిషనర్ రాజాబాబు, కబ్జాదారులకు కొమ్ముకాస్తూ రూ.63 కోట్ల టిడిఆర్ ఇచ్చారని ఆరోపించారు. అక్రమాలకు కొమ్ముకాస్తే, గతంలో 14మంది ఐఎఎస్‌లకు పట్టినగతి తప్పదని హెచ్చరించారు. ఎంవివి, జీవిలపై క్రిమినల్ కేసులు పెట్టి, ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని కోరారు. సమావేశంలో జనసేన నాయకులు శ్రీనివాస్ పట్నాయక్, ఆర్ కృష్ణ, రీజనల్ కోఆర్డినేటర్లు నాగలక్ష్మి శాలినీదేవి శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

## అమరజీవికి ఘననివాళి

ప్రజాశక్తి - యంత్రాంగం

**కలెక్టరేట్, విశాఖ** : ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు వారందరి మదిలో చిరస్థాయిగా నిలిచి ఉంటారని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. గురువారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి కలెక్టర్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ వి.మణిరామ్ పాల్గొన్నారు.

**భీమునిపట్నం** : బీచ్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు పార్కులో ఉన్న ఆయన విగ్రహానికి టిడిపి నియోజక వర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు, రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మాజీ కౌన్సిలర్లు గొలగాని నరేంద్రకుమార్, పిట్టా సురేష్, పి లక్ష్మీ కుమారి, ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్ కృష్ణారావు నివాళు లర్పించారు. వైసిపి ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్ కదిరి ఎల్లాజీ వైసిపి నేతలు వాసుపల్లి ఎల్లాజీరావు, గుండాసు మధునాయుడు, చెల్లూరి .గౌరినాయుడు, గొరపల్లి సన్యాసిరావు, క్రరోతు. నాగేంద్ర, ఎ సూర్య ప్రకాశరావు నివాళులర్పించారు. పిఎస్ఎం, జివిఎంసి ఉన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



భీమిలిలో నివాళులర్పిస్తున్న టిడిపి నేత రాజాబాబు

**ములగాడ** : పొట్టి శ్రీరాములు జీవితాన్ని, ఆయన చేసిన త్యాగాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎన్‌సిసి జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో అమరజీవికి ఘననివాళులర్పించారు. ఎన్‌సిసి ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి, లైబ్రేరియన్ జి.శిరీష పాల్గొన్నారు. క్విజ్‌పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

**ఉక్కునగరం** : వైఎస్ఆర్‌టియుసి ఆధ్వర్యంలో ఉక్కునగరం కొవ్వొత్తుల జంక్షన్ దరి పొట్టి శ్రీరాములు విగ్రహానికి యూనియన్ ప్రధాన కార్యదర్శి వై మస్తానప్ప నివాళులర్పించారు. కార్యక్రమంలో పిట్టరెడ్డి, బి.వి.రామయ్య, చిద్ర రవికుమార్, ఆలూరి గోవిందరావు, పరమానంద బిసాయి, ఏంగాలా కోటి ప్రకాష్, కనితి మహేష్, చంద్రశేఖర్ శకునాల, శివకుమార్‌పాల్గొన్నారు.

**గాజువాక** : అగనంపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులు అర్పించారు.

## పరిశ్రమల శాఖ జిల్లా జనరల్ మేనేజర్‌గా గణపతి



సిహెచ్.గణపతి

ప్రజాశక్తి -మాధవధార : పరిశ్రమల శాఖ జిల్లా జనరల్ మేనేజర్‌గా సిహెచ్ గణపతి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ విశాఖపట్నం జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్‌గా బదిలీపై వచ్చారు. ఇక్కడ జనరల్ మేనేజర్‌గా పనిచేసిన ఎ.రామలింగేశ్వరరాజు డైరెక్టరేట్ ఆఫ్ ఇండస్ట్రీస్, జాయింట్ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్లారు.

## కోల్ కాంప్లెక్స్ భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న సిఎండి అతుల్‌భట్

ప్రజాశక్తి-ఉక్కునగరం : కోకింగ్ కోల్ స్టోరేజ్ యార్డులో వివిధ గ్రేడ్‌ల బొగ్గు నిల్వ సామర్థ్యం 1.5 లక్షల టన్నులకు పెరిగిందని సిఎండి అతుల్ భట్ అన్నారు. ఆర్ఎంహెచ్ విభాగంలో కోక్ ఓవెన్ బ్యాటరీ 5, ఆర్ఎంహెచ్ పి కోల్ కాంప్లెక్స్ భవనాన్ని ప్రారంభించారు. ఆపరేషన్ డైరెక్టర్ ఏకే సక్సేనా, సీనియర్ అధికారులు ట్రేడ్ యూనియన్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు.

## కాలు వంకరకు అరుదైన శస్త్ర చికిత్స




సమావేశంలో మాట్లాడుతున్న అపోలో వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ హెల్త్‌సిటీలోని అపోలో ఆసుపత్రిలో వంకర తిరిగిన నాలుగేళ్ల చిన్నారి మోకాలుకు అరుదైన, అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను డాక్టర్ రవిచంద్ర పట్టిపల్లి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. గురువారం ఆసుపత్రిలో విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన నాలుగేళ్ల పాపకు పుట్టుకతోనే ఎడమ వైపు కాలు వంకరతో నడవలేని స్థితిలో అపోలో వైద్యులను సంప్రదించారు. ఆర్థోపెడిక్ రంగంలోనే అరుదైన ఈ కేసును డాక్టర్ రవిచంద్ర పట్టిపల్లి ఛాలెంజ్‌గా తీసుకుని, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ పిఆర్‌కె ప్రసాద్‌తో కలిసి పాపకు అతిక్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం పాప కోలుకొని, ఎటువంటి నడక సాధనాల లేకుండా సాధారణంగా నడుస్తుండడంతో బాలిక తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇటువంటి శస్త్ర చికిత్స కేవలం జర్మనీలోనే జరిగిందన్నారు.

## గంగవరం పోర్టులో మెరుగైన సేవలు



కొత్తగా ఏర్పాటు చేసిన గిడ్డంగి

ప్రజాశక్తి -గాజువాక : ఆదానీ గంగవరం పోర్ట్‌లో కస్టమర్లకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఆ పోర్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బీజీ గాంధీ అన్నారు. పోర్ట్ ఆవరణలో 11వేల చదరపు మీటర్ల కొత్త గోడౌన్‌ను గురువారం ప్రారంభించారు.పోర్టులో ఏర్పాటుచేసిన ఈ గోడౌన్ నేరుగా రైల్వేట్రాక్‌కు అనుసంధానించినట్లు వెల్లడించారు. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.. మరో 60 రోజుల్లో ఏడు వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో మరో గోడౌన్ ఏర్పాటు చేస్తామన్నారు.

# పొట్టి శ్రీరాములును స్ఫూర్తిగా తీసుకోవాలి

## కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి -అనకాపల్లి

అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో దేశ సేవ చేయాలని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవానికి, తెలుగు ప్రత్యేక రాష్ట్రం కోసం 56 రోజులు ఆమరణ దీక్ష చేపట్టడం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. ఆయన పోరాట పటిమతో యువత ముందుకు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ వెంకటరమణ, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి కె.రాజేశ్వరి, ఏబిసిడబ్ల్యూఓలు సురేష్, నాగేశ్వరరావు, నరసింహమూర్తి, హాస్టల్ వార్డెన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామచంద్ర థియేటర్ కూడలిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, కార్పొరేటర్ మందపాటి సునీత నివాళు లర్పించారు. ఆళ్ల నాగేశ్వరరావు, గైపూరి రాజు, పలక సత్యనారాయణ, నడిశెట్టి మధు తదితరులు పాల్గొన్నారు. అనకాపల్లి మెయిన్ రోడ్డులోని కన్యక పరమేశ్వరి దేవస్థానం కూడలిలో టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. సూరి సతీష్, బోడి వెంకటరావు, కుప్పిలి జగన్మోహన్, మల్ల గణేష్ దూలం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**నర్సీపట్నంటౌన్ :** స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో ఆర్డీవో జయరామ్ పొట్టి శ్రీరాములు వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగ ఫలితంగానే దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు నాంది పడిందన్నారు.స్థానిక పోల్ ఫ్లాట్ సెంటర్ వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆయుష్మాన్ భవ వాసవి క్లబ్ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు.

**నక్కపల్లి :** మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం అప్పారావు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పలరాజు, ఉపాధ్యాయులు, సిబ్బంది రమణమ్మ పాల్గొన్నారు.


పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

## రాష్ట్రస్థాయి జూడో పోటీలకు వడ్డాది విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-వడ్డాది

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు వడ్డాది విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అనకాపల్లిలో ఈనెల 13న జరిగిన జరిగిన జూడో ఛాంపియన్ షిప్‌లో ప్రతిభ కనబర్చి అనకాపల్లి జిల్లా తరుపున రాష్ట్ర స్థాయి పోటీలకు నుండి ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీలకు వడ్డాది జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నుండి బాలికల విభాగంలో కె.కల్పన ఎస్.గీత, ఎన్.వరలక్ష్మి, ఆర్.దుర్గ, డి.రోహిణి, బాలుర విభాగంలో ఎస్.లోకేష్, టి.సంజయ్, కె.గోవిందా రుత్విక్, కె.మధు, ఆర్.సింహాద్రి జయవర్దన్ ఎంపికైన వారిలో ఉన్నారు. వీరు అనంతపురంలో జరగబోయే రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారని పిడి కడగళ్ల నారాయణమ్మ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్ఎమ్ పి.వి.శేషుబాబు, ఇన్‌ఛార్జి హెచ్ఎం వి.వెంకట్రావు, పిఈటి ఎల్.అప్పలనాయుడు, గ్రామ పెద్దలు, తోటి విద్యార్థులు అభినందించారు.

## టిడిపి నేత రమేష్‌కుమార్‌కు ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాశక్తి-అచ్యుతాపురం :** టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్ తల్లి ఇటీవల మృతి చెందడంతో గురువారం ఆయన్ను ఎలమంచిలి ఎమ్మెల్యే యు.రమణమూర్తి రాజు, డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార్‌వర్మ పరామర్శించారు. వారి వెంట కోన బుజ్జి, జెడ్‌పి కోఆప్షన్ సభ్యులు నర్మల కుమార్, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు ఉన్నారు.

## చీమలాపల్లిలో భూ సర్వే ప్రారంభం

**ప్రజాశక్తి-అచ్యుతాపురం :** మండలంలో చీమలపల్లి పంచాయతీలో సమగ్ర భూ రీ సర్వే పనులను గురువారం గ్రామ సర్పంచ్ సియ్యాద్రి నాగ నూకరాజు బుజ్జి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీమలపల్లి పంచాయతీలో సుమారుగా 1100 ఎకరాలు సర్వే జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి నగిరెడ్డి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ సియ్యాద్రి బైరాగి నాయుడు, పాల సంఘం అధ్యక్షుడు మజ్జి రమణ, వైసిపి నాయకులు పైల రామునాయుడు, రాము, నరమాల నాగేశ్వరరావు, సెక్రటరీ పైల భాస్కరరావు, విఆర్ఓ లోవరాజు, సర్వేయర్లు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరానికి విశేష స్పందన

**ప్రజాశక్తి-మునగపాక రూరల్ :** మండల కేంద్రంలోని నందీశ్వర కళా ప్రాంగణం ఆవరణలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన గ్రామస్తుడు ఆడారి సతీష్ జయంతిని పురస్కరించుకొని 2014-2015 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు, సతీష్ మిత్రులు ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా సతీష్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్ వైద్యుల నేతృత్వంలో 50 మంది యువకులు రక్తదానం చేశారు. సతీష్ కుటుంబ సభ్యుడు వేగి కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, టిడిపి సీనియర్ నాయకులు దాడి ముసలి నాయుడు, గ్రామ రైతు సంఘం అధ్యక్షులు ఆడారి మహేష్, ఉత్సవ కమిటీ చైర్మన్ బొడ్డేడ అప్పలనాయుడు, వైసిపి నాయకులు ఆడారి కాశి బాబు, జనసేన నాయకులు బెక్కలి పరశురాం, పెంటకోట స్వరూప్, పాల్ బ్రిక్స్ అధినేత ఆడారి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులు


ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

## 46వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్ఎఓబి నిర్వాసితులు నేవీ మెయిన్ గేట్ ముందు చేస్తున్న ఆందోళన 46వ రోజుకు చేరింది. గురువారం ఎనిమిది గ్రామాల నిర్వాసితులు రోడ్డు బైఠాయించి పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే ప్యాకేజీ చెల్లించాలని, జెట్టీ నిర్మాణం చేయాలని, అంత వరకు ఆధార్ కార్డు ఆధారంగా నేవీ గేట్ గుండా చేపల వేటకు అనుమతించాలని కోరారు. 46 రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నేవీ నిర్వాసిత జెఎసి నాయకులు, 8 గ్రామాలు నిర్వాసితులు పాల్గొన్నారు.

## సూక్ష్మ పరిశ్రమ, వ్యవసాయ రుణాలకు ప్రాధాన్యత

### జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ

ప్రజాశక్తి-అనకాపల్లి

సూక్ష్మ మధ్య చిన్న తరహా పరిశ్రమల ప్రోత్సాహకులకు, వ్యవసాయానికి రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ కె.సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం సత్యనారాయణ అధ్యక్షతన మండల స్థాయి సంయుక్త బ్యాంకుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకులు వ్యవసాయ, మధ్యతరహా సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలకు ఇచ్చిన రుణాలు, సంవత్సరిక ప్రణాళిక, సాధించిన ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీపతి, నాబార్డ్ ఏజీఎం శ్రీనివాస్, అనకాపల్లి ఎంపీడీవో చంద్రశేఖర్, మెప్మా అధికారి శ్రీనివాస్, అనకాపల్లి, మునగపాక, కసింకోట మండలాల బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ

## 18న సిఐటియు బహిరంగ సభకు తరలిరండి


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - పరవాడ

సిఐటియు జిల్లా మహాసభ సందర్భంగా ఈ నెల 18న పరవాడలో జరగనున్న కార్మిక ప్రదర్శన, బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో కార్మికులు తరలివచ్చి జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సిఐటియు మహాసభ కరపత్రాన్ని గురువారం కార్మికులతో కలిసి వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సి హెచ్.నర్సింగరావు, కార్యదర్శి కె.స్వరూపరాణి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు ప్రసంగిస్తారని తెలిపారు. 18న మధ్యాహ్నం నుండి 19 సోమవారం సాయంత్రం వరకు ప్రతినిధుల సభ పరవాడ సీతారామ కళ్యాణ మండపంలో జరుగుతుందని, ఇందులో జిల్లా నలుమూలల నుంచి ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పైలా అప్పారావు, సిహెచ్ చిన్నోడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి జాతీయ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-అనకాపల్లి :** కేరళ రాష్ట్రంలో ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న ఎఐటియుసి జాతీయ మహాసభ వాల్ పోస్టర్‌ను స్థానిక సిపిఐ కార్యాలయంలో గురువారం ఆ సంఘం నాయకులు పెంటకోట సత్యనారాయణ, వైఎన్.భద్రం, కోన లక్ష్మణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మికుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న చట్టాలను నాలుగు కార్మిక కోడ్స్‌గా కుదించి తీరని అన్యాయం చేసిందన్నారు. ఏఐటియూసీ నాయకులు పిన్నింటి రాజ్ కుమార్, రామారావు పాల్గొన్నారు.

## వృద్ధ కళాకారుల పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాశక్తి-అనకాపల్లి :** వృద్ధ కళాకారులు పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి, 58 సంవత్సరాలు నిండిన వారు పింఛన్లకు అర్హులని పేర్కొన్నారు. ఏ ఇతర పింఛన్లు పొందని వారు, కళాకారుల గుర్తింపు కలిగిన, ఆదాయ కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులతో కలెక్టరేట్ ఆవరణలో ఉన్న సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వారి వారి ప్రదర్శన ఫోటోలు, ప్రశంస పత్రాలు, పాస్ పోర్టు సైజ్ ఫోటోలు జత చేయాలని సూచించారు.

## చాముండేశ్వరి హోమంలో ఎంవిఆర్


చాముండేశ్వరి విగ్రహాన్ని మోస్తున్న ముత్యాల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- అనకాపల్లి

స్థానిక భీమునిగుమ్మం చాముండేశ్వరి ఆలయంలో గురువారం నిర్వహించిన హోమంలో ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు, ఆయన తనయుడు సంజయ్ పాల్గొన్నారు. ముందుగా అమ్మవారి విగ్రహాన్ని తలపై పెట్టుకొని మోశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో ఆయనకు ఘన స్వాగతం పలికింది. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని దుస్సాలువలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన భారీ అన్న సమారాధనను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ఎంవిఆర్ యువసేన ప్రతినిధులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్లు అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

## ప్రపంచ వ్యాప్తంగా రోటరీ క్లబ్ సేవలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రొటేరియన్ పిడి జి.కిషోర్ కుమార్ అన్నారు. స్థానిక న్యూ కాలనీ రోటరీ కళ్యాణ మండపంలో గురువారం రోటరీ అంతర్జాతీయ సమావేశాన్ని రోటరీ అంతర్జాతీయ మహిళా అధ్యక్షురాలు జెన్నీఫర్ జోన్స్ విశాఖకు విచ్చేసిన సందర్భాలును పురస్కరించుకుని మహిళల ఉపాధికి కుట్టు మిషన్లు, బాలికలకు సైకిళ్లు, వికలాంగులకు వీల్ చైర్లు, మహిళలకు పొగరాని పొయ్యిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ చైర్మన్ కడిమిశెట్టి సతీష్, ప్రెసిడెంట్ సానా త్రినాధరావు, సెక్రటరీ పెంటకోట రాజేష్ నాయుడు, అసిస్టెంట్ గవర్నర్ పెంటకోట పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి- కె.కోటపాడు : స్థానిక షిర్డీ సాయి ఆలయంలో గురువారం అన్నదానం, నిరుపేదలకు రగ్గులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ వేగి రామారావు మాట్లాడుతూ బైలపూడి రవి, గౌరి దంపతుల ఆర్థిక సహాయంతో ఈ వారం అన్నదానం, రగ్గులు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఎఫ్‌సి గొడౌన్ సిబ్బంది ఈ అన్నదానానికి సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి యాళ్ళ సాయి, మహిళా సేవకులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని దోసూరు గ్రామ ఎస్సీ కాలనీలో నిరుపేద గృహ లబ్ధిదారులకు గురువారం ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు, డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలోని నూక రత్నం, కటారి మరిడమ్మ, పొట్టమ్మకు ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున తమ సొంత నగదును అందజేశారు. అసంపూర్తిగా ఉన్న గృహాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. గ్రామ సచివాలయ భవనం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వాలంటీర్ల పనితీరును అభినందిస్తూ బ్యాగులు పంపిణీ చేశారు. దోసూరు గ్రామంలో పలు వీధుల్లో పర్యటించి గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎంపిటిసి సభ్యులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిటిసి భర్త శ్రీనివాసరావు మృతి

ప్రజాశక్తి -చోడవరం : చోడవరం పంచాయతీ పరిధి ఏడో సెగ్మెంట్ ఎంపిటిసి సభ్యులు యద్ద పార్వతి భర్త, స్థానిక వైసిపి నాయకులు వై.శ్రీనివాసరావు గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. బుధవారం రాత్రి కడుపునొప్పి రావడంతో విశాఖలోని ఓ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించి ఆయన గురువారం మృతి చెందారు. శ్రీనివాసరావు మృతి పట్ల మండలానికి చెందిన పలువురు వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

## బోరుబావి నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని తురకలపూడి శ్మశాన వాటికలో గురువారం బోరు బావి నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ వై.గోవిందు, ఉప సర్పంచ్ గంటల అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్మశాన వాటికలో బోరు లేక మృతదేహాలను అంత్యక్రియలకు తీసుకొచ్చే కుటుంబీకులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ ఉల్లెంగ రాజారావు, బుదిరెడ్డి నాగభూషణం, గంటల వెంకటరమణ, గంటల దుర్గాప్రసాద్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బోరు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

ఫార్మా ఫైర్‌స్టేషన్ ఉద్యోగాల్లో

# నిర్వాసిత యువతకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - పరవాడ

75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ జిఒకు అనుగుణంగా మండలంలోని జెఎన్ ఫార్మాసిటీలోని ఫైర్ స్టేషన్లో నియమించే ఉద్యోగాల్లో నిర్వాసిత గ్రామాల యువతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని వైసిపి మండల మాజీ అధ్యక్షులు బొద్దపు చిన్నారావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫార్మా కంపెనీలు కాలుష్యంతో కేన్సర్, కిడ్నీ, ఊపిరితిత్తుల వ్యాధుల బారిన స్థానికులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రసాయన వ్యర్థాలను ట్రీట్‌మెంట్ ప్లాంటులో శుద్ధి చేయకుండా ఇంకుడు గుంతల్లో నింపడం వల్ల భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యలను రాంకీ యాజమాన్యానికి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దృష్టికి పలు దఫాలు తీసుకెళ్లినా వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే అనుచరుడైన తానాం గ్రామానికి చెందిన ఒక కాంట్రాక్టర్ మెజారిటీ ఫార్మా కంపెనీలలో కాంట్రాక్టు పనులు, మేన్ పవర్ సప్లై చేస్తున్నారని, స్థానికులకు కాకుండా బయటి వ్యక్తులకు పోస్టుకు రూ.2 లక్షల చొప్పున ఉద్యోగాలు అమ్ముకుంటున్నారని విమర్శించారు. పై సమస్యలపై అధికారులు చర్యలు తీసుకోకుంటే రాంకీ ఫార్మా కంపెనీలపై పార్టీలకు అతీతంగా ఆందోళనలు, ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.

# గ్రంథాలయాలకు కొత్త పుస్తకాలు



పుస్తకాలను పరిశీలిస్తున్న గ్రంథాలయాధికారి పద్మావతి

ప్రజాశక్తి- కె.కోటపాడు

మండలంలోని చౌడువాడ శాఖా గ్రంథాలయానికి కొత్తగా వివిధ రకాల పుస్తకాలు వచ్చినట్లు గ్రంథాలయాధికారి ఎం.పద్మావతి తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ భగవద్గీత, రామాయణంతో పాటు వివిధ పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, నవలలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు మొదలైన 630 పుస్తకాలు వచ్చినట్లు చెప్పారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్ వెంకట్రావు కృషితో నూతన పుస్తకాలు వచ్చినట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**కశింకోట** : కశింకోట శాఖ గ్రంథాలయానికి 771 కొత్త పుస్తకాలు వచ్చినట్లు గ్రంథాలయం అధికారి ఎస్.వరలక్ష్మి గురువారం తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ నుండి వీటిని పంపించినట్లు వెల్లడించారు.

**చీడికాడ** : విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి స్థానిక శాఖా గ్రంథాలయమునకు తెలుగు, ఇంగ్లీష్, హిందీ 672 పుస్తకాలు సరఫరా చేసినట్లు గ్రంథాలయ అధికారిని ఎంఎస్ఎల్ జోగేశ్వరి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాలసాహిత్యం, నవలలు, ఆధ్యాత్మిక, పర్సనాలిటీ డెవలప్ మెంట్ కు సంబంధించిన పుస్తకములు అన్ని వర్గాల వారికి ఉపయోగ పడతాయని తెలిపారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి -వడ్డాది : తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం పొలాల్లోనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని టిడిపి చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు, తెలుగు రైతు అధ్యక్షుడు కాళింగ తాతలు డిమాండ్ చేశారు. గురువారం వారు వడ్డాదిలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈకేవైసీ చేయని రైతులు ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు శతశాతం సబ్సిడీతో ఆర్‌బికెల ద్వారా విత్తనాలు సరఫరా చేయాలని కోరారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ టన్నుకు చెరకుకు రూ.3500 చొప్పున మద్దతు ధర చెల్లించాలని, రైతులకు పేమెంట్లు సకాలంలో ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డొంకిన అప్పలనాయుడు పాల్గొన్నారు.

## డి.అగ్రహారంలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని డి.అగ్రహారం గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు చేపట్టారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రతి మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించామని, ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి జగన్మోహన్, ఎంపిడిఓ కె.శశిదేవి, తహశీల్దారు రమేష్ బాబు పాల్గొన్నారు.

## వైసిపిని తరిమికొట్టాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న వైసిపిని తరిమికొట్టాలని టిడిపి నాయకులు ఎం బాబు నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని కడపాలెం గ్రామంలో గురువారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల గ్రామంలో పలు అభివృద్ధి పనులకు వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, స్థానిక సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుమ్మపాల వీధి వేణుగోపాలస్వామి ఆలయం అభివృద్ధికి మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆదేశాలతో మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. తుమ్మపాల వీధి, పెంటకోట వారి దొడ్డి, వజ్రపేట, నడిపల్లి వారి దొడ్డిలో సీసీ డ్రైనేజీల పనులను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంతులూరి రాజాబాబు, వైస్ ఎంపిపి విల్లూరి సూర్యకుమారి చంద్రశేఖర్, ఎంపిటిసి సభ్యులు పన్నీరు వెంకటలక్ష్మి చంటి, పంచదారల కన్నారావు, వైస్ ప్రెసిడెంట్ మొగసాల లక్ష్మీ వెంకట్, జిల్లా పరిషత్ పాఠశాల కమిటీ చైర్మన్ గొంతిన శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు రవ్వ శ్రీను, చదరం చిన్న, పడాల గణపతి, నడిపల్లి గణేష్, ఆర్టీసీ సత్యనారాయణ పంచాయతీ ఈవో కె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయరూ...

ప్రజశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది మెయిన్ యుపి స్కూల్ వద్ద మెయిన్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పెద్దేరు వంతెన శిథిలం కావడంతో కస్పా మెయిన్ రోడ్డు గుండా వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. గతం కంటే ఇప్పుడు విపరీతంగా ట్రాఫిక్ పెరిగింది. వేగ నియంత్రణ లేక వాహనాలు అతివేగంగా తిరుగుతున్నాయి. దీంతో విద్యార్థులు, స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గొల్లవీధి, బ్రాహ్మణ వీధికి ఇదే ప్రధాన కూడలి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్నందున స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



నూతన భవనాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

## తంతడిలో నూతన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని తంతడి గ్రామంలో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్ (హాస్పటల్) భవనాలను గురువారం ఎలమంచిలి ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజు, డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలోనే ప్రభుత్వ వ్యవస్థ ద్వారా సుపరిపాలన అందించాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇక్కడ పనిచేసే సిబ్బంది ప్రజలకు మేలైన సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా రమణమూర్తిరాజును, సుకుమార్ వర్మను గ్రామస్తులు జ్ఞాపిక అందజేసి పూలమాలవేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కోన బుజ్జి, ఎంపిటిసి సభ్యురాలు రాజాన పద్మావతి అప్పారావు, గ్రామ సర్పంచ్ చౌడిపల్లి మురళి, మోటూరు సంజీవి, ఎస్ జువాల నాయుడు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కెపి.అగ్రహారం సర్పంచ్‌కు గాయాలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని కశింకోట -బంగారు మెట్ట రహదారిలో చిన్నప్పన్నపాలెం -బంగారం మెట్ట గ్రామాల మధ్య గురువారం ఉదయం ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మండలంలోని కెపి.అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీనుకు తీవ్రంగా గాయాలయ్యాయి. గోపిశెట్టి శ్రీను తన ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న వాహనదారుడు ఢీకొనడంతో ఆయన రోడ్డుపై పడిపోయాడు. దీంతో ఈయనకు కాలు, భుజంపై తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానిక జడ్పిటిసి దొండా రాంబాబు తన వాహనంలో విశాఖపట్నం తరలించి చికిత్స అందించారు.

## 10 మంది జూదరుల అరెస్టు 22,820 నగదు స్వాధీనం

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్

మండలంలో పులపర్తి, కొక్కిరాపల్లి గ్రామాల శివారుల్లో పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించి, పది మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.22,820 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎలమంచిలి రూరల్ ఎస్సై కె.సన్నిబాబు తెలిపారు. పులపర్తి గ్రామంలో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి, రూ.12,440 నగదు, కొక్కిరాపల్లి అగ్రహారంలో ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి రూ.10,380 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మండల పరిసర ప్రాంతాల్లో ఎవరైనా పేకాట, కోడిపందాలు ఆడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని అమృతపురం గ్రామంలో రేమా బ్లెస్సింగ్ చర్చి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సంఘ కాపరి వి.కృపారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రెవ. కుమారి అధ్యక్షత వహించారు. ప్రముఖ సువార్తికులు యూన్నీ ప్రేమ్ క్రిస్మస్ సందేశం అందించారు. సంఘంలోని మహిళలు ప్రార్థనలు చేశారు. ప్రత్యేక పాటలు ఆలపించారు. చిన్నారుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర దళిత నాయకులు గోటివాడ సామ్రాట్ కుమార్, డేవిడ్ రాజు, ప్రసాద్, జాన్ బాబు, బ్యూలా, సుధ, లావణ్య, నవీన్, మేరీ రత్నం, జ్యోతి, సమర్పణమ్మ, పింకీ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

## పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-చీడికాడ :మండలంలోని శిరిజాం కన్నూరు కళ్ళాల్లో గురువారం పశు వైద్య శిబిరం ఖండివరం పశువైద్య అధికారి సి.హెచ్. గణేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాడి పశువులకు పొదుగు వాపు వ్యాధి రాకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్తలు గణేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పశు వైద్య సహాయకులు శ్రీనివాస్, ల్యాబ్ టెక్నీషియన్ కుమారి, పశు వైద్య సహాయకులు రిషి కిరణ్, ముర్తా శ్రీనివాస రావు, అప్పలరాజు, భానుచంద్ర పాల్గొన్నారు.




మందులు ఇస్తున్న వైద్యులు

# వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడాలి : అయ్యన్న

ప్రజాశక్తి -రూరల్:రాష్ట్రంలో దుర్మార్గపు పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వానికి చరమగీతం పాడాలని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్న పాత్రుడు పిలుపునిచ్చారు. మండలంలోని కొత్తలక్ష్మీపురం గ్రామంలో ఇదేం కర్మ ఈ రాష్ట్రానికి అనే కార్యక్రమం గురువారం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్ళి వైసిపి చేస్తున్న అరాచకాలను వివరిస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, గడిచిన మూడున్నర కాలంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదన్నారు. ప్రశ్నించే నాయకు లపై కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. ఈ దుష్పాలనను ప్రశ్నించే వారిని అక్రమంగా అరెస్టు చేసి దౌర్జన్యపాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సుకల రమణమ్మ, మండల పార్టీ అధ్యక్షులు లాలం శ్రీరంగస్వామి, కెఎల్.పురం మాజీ సర్పంచ్ గెడ్డం వీర్రాజు, టీడీపీ నాయకులు రాజుమల్లు, నర్సీపట్నం మున్సిపాలిటీ టీడీపీ కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ, మున్సిపల్ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు, మాజీ కౌన్సిలర్ పైల గోవిందు, సుకల అప్పలనాయుడు పాల్గొన్నారు.

మాకవరపాలెం: టిడిపి తోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. గురువారం మండలంలో లచ్చన్న పాలెం గ్రామంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. టిడిపి హయంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు ఆర్వై పాత్రుడు, నాయకులు అల్లు రామనాయుడు, రత్తల శేష్ కుమార్, పోతల అప్పలనాయుడు, పోతల రాంబాబు, జోగుపాత్రుడు, దుంగల రామనాయుడు పాల్గొన్నారు



అయ్యన్నకు స్వాగతం పలుకుతున్న నాయకులు

## 21న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:విజయవాడలో ఈనెల 21న నిర్వహించే భూ సాధన రాష్ట్ర సదస్సుకు తరలి రావాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాకిరెడ్డి రాము నాయుడు పిలుపు నిచ్చారు. స్థానిక కష్ణ ప్యాలెస్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాము నాయుడు మాట్లాడుతూ, తాత ముత్తాతల నుండి అటవీ బంజరు భూముల్లో జీడి మామిడి తదితర పంటలు సాగు చేసుకుంటున్న రైతులను ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు దాడులను చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. పోడు వ్యవసాయంపై ఎన్నో నిరుపేద కుటుంబాలు జీవనం సాగిస్తున్నారన్నారు.మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో కొన్ని చట్టాలను అమలులో తీసుకొచ్చి కొంతమందికి పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శివలంక కొండలరావు, రైతు సంఘం జిల్లా నాయకులు జి. గురుబాబు, వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు శ్రీరామమూర్తి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న రామునాయుడు



మాట్లాడుతున్న పాపారావు

## 18న దళిత గిరిజన జెఎసి సదస్సు

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్: విజయవాడలో ఈ నెల 18న జరిగే దళిత గిరిజన జేఏసీ సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు పిలుపునిచ్చారు. మండలంలోని చెట్టుపల్లి గ్రామంలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దళిత, గిరిజనుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు వారి సంక్షేమానికే ఖర్చు చేయాలని తెలిపారు.ఎస్సీ ఎస్టీల చట్టాలను కఠినంగా అమలు చేసి, బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ప్రైవేట్ కంపెనీల్లో రిజర్వేషన్లు అమలు చేసి, ప్రభుత్వ భూమి పంపిణీ చేయాలని కోరారు. అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి డబల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించాలని, దళిత గిరిజన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఉపాధి పని దినాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీను, నానిబాబు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంకు మెట్ల నిర్మాణానికి వినతి

ప్రజాశక్తి-నక్కపల్లి :మండలంలోని రాజయ్యపేటలో వాటర్ ట్యాంక్కు వెంటనే మెట్లు నిర్మాణం చేపట్టాలని ఏపీ మత్స్యకార జేఏసీ జిల్లా అధ్యక్షులు పిక్కి స్వామి కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీతారామరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ, వాటర్ ట్యాంక్ కు మెట్లు లేకపోవడంతో చాలాకాలం నుంచి ట్యాంక్ క్లీన్ చేయలేదని, దీంతో గ్రామస్తులు అనారోగ్యం బారిన పడతారని ఆవేదన వ్యక్తం చేస్తారు. గతంలో కూడా సమస్యను అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగిందని, నేటి వరకు సమస్య పరిష్కరించ లేదన్నారు. మెట్ల నిర్మాణం చేపట్టి ఎప్పటికప్పుడు ట్యాంకు శుభ్రపరిచే విధంగా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.



వినతిపత్రం ఇస్తున్న స్వామి

## డ్రైయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పుత్తడి గైరంపేట పంచాయతీకి ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ పది లక్షల నిధులు మంజూరు చేయడంతో పంచాయతీలో డ్రైయినేజ్ కాలువల నిర్మాణ పనులను గురువారం సర్పంచ్ పత్తి రమణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్స్, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న సర్పంచ్

## నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు

### ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకటాద్రి

ప్రజాశక్తి -పాయకరావుపేట:స్థానిక పాండురంగ స్వామి దేవాలయంలో ఈనెల 16వ తేదీ నుంచి వచ్చే నెల 14 వరకు ధనుర్మాసోత్సవ మహోత్స వాలు, 23న సమారాధన నిర్వహిస్తామని దేవాలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకటాద్రి గురువారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. గోదాదేవి ధనుర్మాసోత్సవం, వ్రతము వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.



## కోటేశ్వరరావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో మేడివాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పర్సన్ ఇంచార్జ్‌గా కుంచంగి కోటేశ్వరరావు గురువారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పిఏసిఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు కంచిపాటి జగన్నాధరావు నూతనంగా ఎన్నికైన పిఏసిఎస్ పర్సన్ ఇంచార్జ్ కోటేశ్వరరావును సన్మానించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తనను పిఏసిఎస్ కు పర్సనల్ ఇన్చార్జిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతను మంచి పేరు తీసుకొచ్చే విధంగా పని చేస్తానని ఆయన తెలిపారు. పార్టీ అధిష్టానం తనను గుర్తించి సముచితమైన స్థానాన్ని కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కోపరేటివ్ అధ్యక్షులు ఆసరి శ్రీనివాసరావు, టి.అర్జాపురం మాజీ సర్పంచ్ సన్యాసినాయుడు, పొన్నవోలు సర్పంచ్ రాజారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-యస్. రాయవరం:మండలంలోని భీమవరం గ్రామంలో గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే బాబూరావుకు సమస్యలు స్వాగతం పలికాయి. గురువారం ఎమ్మెల్యే వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. డ్రైనేజీలు లేక మురుగునీటితో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు తెలిపారు. జగనన్న ఇంటి బిల్లులు రాలేదని, అర్హులున్నా పెన్షన్ అందలేదని ఎమ్మెల్యేకు తెలిపారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే అధికారులకు సూచించి తక్షణమే సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

# రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారుణులు

ప్రజాశక్తి -నక్కపల్లి:స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఐదుగురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి బాలికల అండర్ 14 హాకీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పుష్ప రాగం, పిడి లక్ష్మి తెలిపారు. మూడు జిల్లాల హాకీ పోటీలలో వీరు ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, అనంతపురం లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారుణులను హాకీ ఫౌండర్ సూరిబాబు, చిన్న అప్పారావు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ ఉపాధ్యాయులు సంధ్యా రాణి, పద్మావతి, ఉషారాణి, ప్రమీల రాణి, గుణవతి, కనక అభినందించారు.

గొలుగొండ:సింహచలం ఏంపిఎపిబిసి డబ్ల్యూఆర్ స్కూల్లో ఈ నెల 14న నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌లో హ్యాండ్ బాల్ విభాగం అండర్-14లో చోద్యం హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హెచ్ఎం జి.రత్నాజీ, పిఈటి టీచర్ నర్సింగరావు, కుందూరు నూకరాజు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు అభినందించారు. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన సిహెచ్.ధనలక్ష్మీ, పి.మౌనిక, వై.రేవతిలు అనంతపురం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని హెచ్ఎం రత్నాజీ తెలిపారు.




క్రీడాకారులతో ఉపాధ్యాయులు



## హ్యాండ్ బాల్‌లో శ్రీ ప్రకాష్ సత్తా

పాయకరావుపేట:స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సింహాచలంలో 14న జరిగిన హ్యాండ్ బాల్ అండర్ -14, 17 బాలుర, బాలికల విభాగంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలకు శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ నుండి 6 గురు బాలికలు, నలుగురు బాలురు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు డివి శ్రీనివాస్ తెలిపారు. వీరంతా విశాఖపట్నం జిల్లా తరుపున త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.విద్యార్థులను విద్యా సంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, ప్రిన్సిపల్ ఎంవివి ఎస్ మూర్తి, భానుమూర్తి, కోచ్‌లు సురేష్, బాలరాజు తదితరులు అభినందించారు.

## పాస్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో ఇటీవల రీ సర్వే నిర్వహించిన గ్రామాల్లో రైతులకు పాస్ పుస్తకాలు తహసిల్దార్ జానకమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ఎండపల్లి, రాజుపేట, రామన్నపాలెం, సంకఫూర్ గ్రామాలకు సంబంధించి 668 ఈ పాస్ పుస్తకాలు పంపిణీ చేపట్టినట్లు తెలిపారు.ఆయా గ్రామాల్లో చిన్న చిన్న వివాదాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి వారికి కూడా త్వరలో పాస్ పుస్తకాలు అందజేస్తామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవి పాల్గొన్నారు.

## రోగులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పాయకరావుపేట:మండలంలోని శ్రీరామపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి పాల్మంపేట గ్రామ సచివాలయం వద్ద గురువారం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్‌లో భాగంగా వద్ధులను, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మెడికల్ ఆఫీసర్లు పి.కావ్య, 104 మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బత్తుల రత్న శేఖర్ పరీక్షలు నిర్వహించారు. రోగులకు మందులు అందజేశారని ఆరోగ్య విస్తరణ అధికారి ఆర్.జె.బాలాజీ సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా ఇంచార్జి నోడల్ ఆఫీసర్ పి.ఎస్విఎస్ ప్రసాద్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆర్.డిల్లీశ్వరి, స్థానిక సచివాలయం హెల్త్ సెక్రెటరీ డి.దివ్య జ్యోతి, గ్రామ సర్పంచ్ కె. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు అయ్యన్న అభినందనలు

**ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:**మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలకు వెళుతున్న క్రీడాకారులను మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అభినందించారు. ఈ నెల 18న తిరుపతిలో జరిగే మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలకు మున్సిపాలిటీ 3వ వార్డు ఎస్సీ కాలనీకి చెందిన మద్ర రామ్, 26వ వార్డుకు చెందిన ఎస్.ప్రతిక్ లు బాడీ బిల్డింగ్ కోచ్ గొలుసు పురుషోత్తం, టిఎస్ సాల్మన్ రాజు, ఏపిఎఫ్ బిసిఎ జనరల్ సెక్రటరీ ఆధ్వర్యంలో వెళుతున్నారు. ఈ మేరకు గురువారం మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడును వీరంతా కలిశారు. ఈ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి విజయం సాధించాలని అయ్యన్నపాత్రుడు ఆకాంక్షించారు.


క్రీడాకారులతో అయ్యన్న


అభినందిస్తున్న అధికారులు

## డిప్యూటీ కలెక్టర్‌కు అభినందనలు

**ప్రజాశక్తి-నక్కపల్లి:**తహసిల్దార్ సుబ్రహ్మణ్యంశాస్త్రికు డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగోన్నతి పొందడంపై పలువురు అభినందించారు. ఆయనకు మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసం నానాజీ, ఎంపీడీవో సీతారామరాజు, ఇఓపిఆర్‌డి వెంకట నారాయణ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి నీరజ, ఎలక్షన్ డిటి తాతాచార్యులు పాల్గొన్నారు.

## ప్రపంచ బాడీ బిల్డింగ్‌లో సత్తా

**ప్రజాశక్తి - చీడికాడ:** ప్రపంచ బాడీ బిల్డింగ్ పోటీలలో సిల్వర్ బహుమతి గెలిచిన ఆర్మీ ఉద్యోగి మారునాయుడును గ్రామ సర్పంచ్ సలాది ధనలక్ష్మి గంగ శేషు అభినందించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ, అడవుల అగ్రహారం గ్రామానికి చెందిన ఆయన ఆర్మీలో ఉద్యోగ విధులు నిర్వహిస్తూ బాడీ బిల్డింగ్ పోటీల్లో ఎన్నో బహుమతులు గెలిచారన్నారు. ప్రపంచ బాడీ బిల్డింగ్‌లో పోటీలలో సిల్వర్ బహుమతి గెలిచి మండలానికి, భారతదేశానికి గర్వకారణంగా నిలిచాడని కొనియాడారు. గ్రామ సర్పంచ్ తో పాటు యువకులు అభినందించారు.



అవార్డుతో ఆర్మీ ఉద్యోగి మారునాయుడు

## చినగుమ్ములూరులో పంటకోత ప్రయోగం

**ప్రజాశక్తి-యస్.రాయవరం:**మండలంలోని చినగుమ్ములూరు గ్రామంలో పంటకోత ప్రయోగం చేపట్టినట్లు మండల వ్యవసాయశాఖాధికారి సౌజన్య తెలిపారు. గురువారం ఎంపిక చేసిన పంటపొలాల్లో పంటకోతను సీనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ కేవీ సురేష్ కుమార్ నేతృత్వంలో జరిపారు. పంట కోత ప్రయోగం ద్వారా పంట దిగుబడి నిర్ధారించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విఏఏ రోజా రోహిణి, రైతులు పాల్గొన్నారు.


శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారిని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఆ శాఖ కమిషనర్ డాక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ గురువారం దర్శించుకున్నారు. వారికి ముందుగా ఆలయ ఇఒ కె.శిరీష, ట్రస్టు బోర్డు సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.
- ప్రజాశక్తి-కలెక్టరేట్

### ఫారెస్టు అధికారుల కనుసన్నల్లోనే..

# రంగురాళ్ల తవ్వకాలు?

- పది రోజుల్లో రూ.50 లక్షల వ్యాపారం
- వ్యాపారులకు సహకరిస్తున్న ఫారెస్ట్ సిబ్బంది
- అదే విధంగా గుట్టుగా అటవీ కలప రవాణా



**ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:**నియోజకవర్గంలోని గొలుగొండ మండలంలోని మరో రంగురాళ్ళ క్వారీ బయట పడింది. ఈ రంగురాళ్ల కారిలో విలువైన అలెక్స్ వంటి జాతి రాళ్ళ లభ్యమవుతున్నట్లు సమాచారం. గొలుగొండ మండలంలోని ఆరిలోవ అటవీ ప్రాంతంలో దట్టమైన అడవి ఉండేది. ఇప్పుడు అది కాస్త అక్రమార్కుల చేతిలో నలిగి అడవి అంతా అంతరించి పోయింది. అక్రమార్కులు అక్రమంగా కలప నరికివేతతో అటవీ ప్రాంతం అంతరించిపోయింది. ఇదే కాకుండా ఈ అటవీ ప్రాంతంలో పప్పు శెట్టిపాలెం, కరక, ఇప్పుడు ఆర్లి అడవిలో రంగు రాళు లభ్యమవుతున్నాయి. ఈ ప్రాంతంలో రంగు రాళ్ల తవ్వకాలతో పాటు అటవీ కలప రవాణా జరుగుతుంది. ఇది కేవలం అటవీ శాఖ అధికారులు, సిబ్బంది కనుసల్లోనే జరుగుతుందనే అనుమానాలు వ్యక్తమవు తున్నాయి.

ఆర్లి అటవీ ప్రాంతంలో కొద్ది రోజులుగా రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ తవ్వకాలు అటవీశాఖ కిందిస్థాయి సిబ్బంది సహకారంతోనే జరుగుతున్నాయనే ప్రచారం జోరుగా సాగుతుంది. అసలు ఫలానా ప్రదేశంలో రంగురాళ్ల దొరుకుతున్నాయనే సమాచారం ఇచ్చింది కూడా అటవీశాఖ కిందిస్థాయి సిబ్బందేనని ప్రచారం కూడా ఉంది. ఇంతే కాకుండా అటవీ శాఖ ఉన్నతాధికారికి గొలుగొండ అటవీ ప్రాంతం పై పూర్తి అవగాహన ఉంది. ఆయన గతంలో ఈ మండలంలోని పని చేశారు. గతంలో పప్పుశెట్టిపాలెం శివారులలో రంగురాళ్ల వ్యాపారులు పెద్ద పెద్ద సొరంగాలు తవ్వి రంగురాళ్ల వెలికి తీస్తున్న సమయంలో రెవిన్యూ, ఫారెస్ట్, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి తవ్వకాలను అరికట్టడమే కాకుండా సొరంగాలను కాంక్రీట్‌తో మూయించారు. తర్వాత కొద్ది రోజులు తవ్వకాలు నిలిచి పోయాయి. ఇప్పుడు మళ్లీ ఆరిలోవ అటవీ ప్రాంతంలో రంగురాళ్ల దొరుకుతుండడంతో వ్యాపారస్తులు కూలీలను ప్రోత్సహించి తవ్వకాలు మొదలు పెట్టారు. ఈ 15 రోజులలో సుమారు రూ.50 లక్షల రూపాయల వ్యాపారం జరిగినట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా అటవీశాఖ అధికారులు, సిబ్బంది స్పందించక పోవడం గమనార్హం. రంగురాళ్ళు విరివిగా లభిస్తుండటంతో కూలీలు గుంపులు గుంపులుగా ఆ ప్రాంతానికి ఇటీవల చేరుకున్నారు. ఒక దశలో అక్కడ ఘర్షణ వాతావరణం కూడా నెలకొంది. ఇంత హడావుడి జరుగుతున్నా ఫారెస్ట్ అధికారులు అటువైపు చూడక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. 15 రోజులుగా తవ్వకాల జరుగుతున్నప్పటికీ వాచర్లు, బీట్ ఆఫీసర్లు, రేంజర్ స్థాయి అధికారి కూడా నిలుపుదలకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. తవ్వకాల విషయం మీడియా ద్వారా బయటకు పొక్కడంతో అప్పుడు గాని డీఎఫ్ఓ ఆ ప్రాంతంలో పర్యటించ లేదు. మీడియా ద్వారా ప్రచారం అయిన తర్వాత డిఎఫ్ఒ అక్కడికి చేరుకోవడం ఆశ్చర్యం. తవ్వకాలను నిలుపుదల చేసిన తర్వాత ఇప్పటివరకు ఐదుగురు పైనే కేసు నమోదు చేశారు. ఇంకా 25 మందిపై కేసు నమోదు చేయాలని అధికారులే తెలియజేశారు. మరి ఇప్పటివరకు వారిపై ఎందుకు కేసు నమోదు చేయలేదనే దానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


ఆర్లి అడవిలో సొరంగం తవ్విన ప్రదేశం

**స్పందించని అటవీశాఖ అధికారులు**

ఇంత ముమ్మరంగా తవ్వకాలు జరిగినప్పటికీ రేంజర్, మిగతా అధికారులు, సిబ్బంది కనీసం స్పందించకపోతే రంగురాళ్ల తవ్వకాలు, కలప అక్రమ రవాణాను ఏ విధంగా అడ్డుకోగలరని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు కూడా ఈ మండలంలో సిబ్బంది తీరుపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సి ఉందని పలువురు తెలిపారు.

## శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

**ప్రజాశక్తి -కోటవురట్ల:**పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, నాణ్యమైన విద్యను అందజేయాలని జిసిడిఓ వెంకటలక్ష్మి సూచించారు. మండలంలో కేజీబీవీ సహా పలు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందజేస్తున్న మెనూ, వసతుల రికార్డులను పరిశీలించారు.విద్యార్థులతో ముచ్చటించి వారి నుండి పలు ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు.శతశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆమెతో పాటు ఎఫ్ఏఓ రామచంద్ర శేఖర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

## నూతన పింఛన్ల పరిశీలన

**ప్రజాశక్తి- కోటవురట్ల:**మండల కేంద్రంలో గురువారం ఎంపీడీవో చంద్రశేఖర్ సామాజిక పింఛన్ల తనిఖీ చేపట్టారు. ఇటీవల కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్ల లబ్ధిదారుల నుండి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చే నెల నుండి రూ.2750 చొప్పున పింఛన్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్, కోటవుట్ల ఎంపీటీసీ సూర్యరావు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

**గొలుగొండ:**ఏఎల్‌పురం సచివాలయంలో ఎంపిడిఓ డేవిడ్‌రాజు గురువారం కొత్త పింఛనుదారుల దరఖాస్తులు గురువారం పరిశీలించారు. వచ్చే నెలలో కొత్త ఫించన్లు మంజూరైన నేపథ్యంలో దరఖాస్తులు చేసుకున్న వారి సర్టిఫికేట్లు, ఇతర పింఛన్ల తనిఖీ చేశారు.


పరిశీలిస్తున్న ఎంపిడిఓ

## 21న మెగా రక్తదాన శిబిరం

**ప్రజాశక్తి-గొలుగొండ:** ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ నెల 21న నర్సీపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాయంలో జరిగే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు కోరారు. గురువారం రక్తదాన శిబిరానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ, గత 13 సంవత్సరాలుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గజ్జలపు మణి కుమారి, వైస్ ఎంపిపి సుర్ల ఆదినారాయణ, సర్పంచుల ఫోరం అధ్యక్షులు నల్లబెల్లి శ్రీనివాసరావు, మహిళ మండల పార్టీ అధ్యక్షురాలు లోచల సుజాత, మండల వ్యవసాయ సహాల మండలి చైర్మన్ కొల్లు సత్యనారాయణ, పార్టీ అధికార ప్రతినిధి జక్కు అప్పలస్వామినాయుడు, పాతకేడిపేట సర్పంచ్ సత్యంనాయుడు పాల్గొన్నారు.

# దెబ్బతిన్న వరి పంట పరిశీలన

**కోత కోయని వరి పొలాలు 33 శాతం కంటే నష్టం వాటిల్లితే పరిహారానికి నమోదు: మోహనరావు**

**ప్రజాశక్తి-నక్కపల్లి:**మండలంలోని గొడిచెర్లలో తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరి పొలాలను గురువారం జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు స్థానిక వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. రైతులు వర్షానికి తడిచిన వరి పనలను ఆయనకు చూపించారు. పొలాల్లో తడిచిన వరి పనలపై 5శాతం ఉప్పు ద్రావణం పిచికారి చేయాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం వాటికి నష్టపరిహారం వర్తించదన్నారు. కోత కోయకుండా ఉన్న వరి పొలాలు 33 శాతం కంటే అధికంగా నష్టం వాటిల్లితే నష్టం పరిహారం నమోదు చేయుటకు ఆస్కారం ఉంటుందన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నక్కపల్లి మండలంలోని గొడిచెర్ల, వేంపాడు రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏ డీ)టి ఎస్ రాజ్ కమల్, మండల వ్యవసాయధికారి ఉమాప్రసాద్ , వ్యవసాయ సహాయకులు సురేంద్ర, రాకేష్ పాల్గొన్నారు.


పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి